క్లుప్తంగా

నందివాయలో వైఎస్సార్ జలకళ బోర్లు



రైతు పొలంలో వేసిన జలకళ బోరు

పొదలకూరు: మండలంలోని నందివాయ గ్రామంలో వైఎస్సార్ జలకళ బోర్లు మంజూరు చేసి వేయిస్తున్నారు. గురువారం రైతుల పొలాల్లో వేసిన బోర్లలో నీరు సమృద్ధిగా పడినట్లు ఆ గ్రామ నాయకుడు ఎస్.శశిధర్‌రెడ్డి తెలిపారు. పొదలకూరు మండలానికి సుమారు 200 బోర్లు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ సుకుని మంజూరు చేయించారు. ప్రధానంగా నిమ్మతోటల్లో బోర్లు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నర్సారెడ్డికాలనీలో వైద్యశిబిరం



పొదలకూరు: పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో 104 అంబులెన్స్ సిబ్బంది గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ వైద్యశిబిరంలో 54 రకాల మందులను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాధాకుమారి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని 7వ వార్డులో నివాసం ఉంటున్న షేక్ ఖాదర్‌హుస్సేన్ ఇటీవల మృతిచెందగా వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ సాయంగా అతని భార్య సమీనాకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా బేగం, నాయకుడు డాక్టర్ అల్లాభక్షు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


కల్లుగీత కార్మిక సొసైటీ ఎన్నికలు



ఎన్నిక నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల, పల్లాప్రోలు గ్రామాలకు చెందిన కల్లుగీత కార్మికుల సొసైటీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవమైనట్లు ఎక్సైజ్ సీఐ రామారావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని రేబాల, పల్లాప్రోలు గ్రామాల్లో పర్యటించిన ఆయన స్థానిక కల్లుగీత కార్మికులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి కల్లుగీత కార్మికుల ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు గ్రామాల్లో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం కోఆపరేటివ్ ఇన్స్పెక్టర్ కృష్ణరావు, ఎక్సైజ్ ఎస్సై మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న దినేష్‌రెడ్డి

కోవూరు: స్థానిక టీఎన్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి రూ.30 వేలతో సమకూర్చిన నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డిని కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు ఉపసర్పంచ్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపల్ సికిందర్, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కరరెడ్డి, దామరమడుగు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జేబీఆర్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత మృతికి సంతాపం

ముత్తుకూరు: సీపీఐ ముత్తుకూరు మండల సీనియర్ నేత నెల్లూరు సుధాకర్‌రెడ్డి(75) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. పంటపాళెంలోని స్వగృహంలో సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి రామరాజు, సీపీఎం, సీపీఐ తదితర పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

జగనన్న సురక్ష.. భవితకు రక్ష

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



కోవూరు: ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలు అందుకున్న మహిళలు

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రజల భవితకు రక్ష అని, ఆ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లు 'కోహినూర్ వజ్రాలని' కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో గురువారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు 11 రకాల విలువైన సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించి అర్హులందరికీ అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా..!

కొడవలూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. కొడవలూరు మండలం కమ్మపాళెం, గండవరంలలో గురువారం జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓలు రమాదేవి, పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.రాజకుమారి, ఎంపీటీసీ సభ్యుడు పెనాక శ్రీనివాసులురెడ్డి, నాయకులు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, కొండా శ్రీనివాసులురెడ్డి, బెల్లం నగేష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

వరకవిపూడి, ఈదూరు గ్రామాల్లో..

తోటపల్లిగూడూరు: మండలంలోని వరకవిపూడి, ఈదూరు గ్రామ సచివాలయాల్లో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు నిర్వహించారు. వరకవిపూడి సచివాలయ పరిధిలో 704, ఈదూరు సచివాలయ పరిధిలో 1,857 మందికి వివిధ రకాల సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారు సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, ఎంపీడీఓ హేమలత, తహసీల్దార్ హమీద్, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, సచివాలయాల కమిటీ మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, కూరపాటి కృష్ణారెడ్డి, ఈదూరు సర్పంచ్ టంగుటూరు శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ఇనకళ్ల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం

ముత్తుకూరు: 'జగనన్న సురక్ష' కార్యక్రమం మండలంలోని ముసునూరువారిపాళెం, పంటపాళెం సచివాలయాల్లో గురువారం విజయవంతంగా జరిగింది. పంటపాళెంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 15 మంది వలంటీర్ల 767 ఇళ్లను సర్వే చేసి 493 వినతులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్‌డీ హేమంత్ పాల్గొన్నారు. అలాగే ముసునూరువారిపాళెంలో ఎంపీడీఓ ప్రత్యూష ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సచివాలయం పరిధిలో 19 మంది వలంటీర్లు 987 ఇళ్ల సర్వే చేసి 509 వినతులకు సంబంధించి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్ మునుకూరు జనార్దన్‌రెడ్డి, పైనాపురం సర్పంచ్ విజయకుమార్, సుధీర్‌రెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు చేరువ చేసేందుకే..

బుచ్చిరెడ్డిపాళెం: అర్హులైన వారికి సంక్షేమ పథకాలు చేరువ చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. స్థానిక 2వ సచివాలయం వద్ద గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్, కౌన్సిలర్లు జయంతి, అనంతలక్ష్మి, యానాది రెడ్డి, నాయకుడు మోర్ల మురళి తదిరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మినగల్లులో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెంచలశ్యామ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ పూజిత, నాయకులు రాము, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

మనుబోలు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. మండలంలోని జట్ల కొండూరు సచివాలయంలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగమ్మ, వెంకటరమణయ్య, ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శివకృష్ణయ్య, ఏపీఎం వనజాక్షి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, ఏఓ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

వెంకటాచలం: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జేసీఎస్ మండల కన్వీనర్ మండల వెంకటశేషయ్య అన్నారు. వెంకటాచలం మండలం కురిచెర్లపాడు గ్రామంలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించి దరఖాస్తుదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్బర్‌బాషా, ఎంపీటీసీ సభ్యురాలు ప్రభావతి, నాయకుడు వెంకటరమణయ్య పాల్గొన్నారు.

పొదలకూరులో..

పొదలకూరు: ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, తహసీల్దార్ కె.వీరవసంతరావు ఆధ్వర్యంలో పొదలకూరు బిట్–2, బిట్–4 సచివాలయాల్లో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. నోడల్ అధికారులుగా ఉద్యానాధికారి ఈ.ఆనంద్, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి వ్యవహరించారు. దరఖాస్తుదారులకు సుమారు 850 సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షఫీ, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ సోమ అరుణ, ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు, వార్డు సభ్యులు ఎ.అనూరాధ, భాస్కర్, హరి తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: కమ్మపాళెంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



తోటపల్లిగూడూరు: వరకవిపూడి గ్రామసభలో..



ముత్తుకూరు: మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



బుచ్చిరెడ్డిపాళెంలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ



మనుబోలు: జట్ల కొండూరు సచివాలయంలో..



వెంకటాచలం: కురిచెర్లపాడు గ్రామంలో..



పొదలకూరు: సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దళితులు, గిరిజనులపై చంద్రబాబుది కపటప్రేమ

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: దళితులు, గిరిజనులపై ప్రతిపక్షనేత చంద్రబాబుది కపట ప్రేమ అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని 5వ వార్డులో గురువారం వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు మాట్లాడుతూ ఎవరైనా దళితులుగా పుట్టాలని కోరుకుంటారా అని అన్నారని, ఇప్పుడు యూటర్న్ తీసుకుని అనలేదని చెప్పడం దారుణమని అన్నారు. దళిత, గిరిజనుల పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. ఆయనకు ఎన్నికల సమయంలోనే వారు గుర్తుకువస్తారని తెలిపారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు రూ.కోట్లు గడించారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలను వదిలేసి కేవలం స్వప్రయోజనాల కోసమే ఆరాటపడ్డారని ఆరోపించారు. చివరికి ఎన్టీఆర్ అభిమానులను కూడా పక్కన పెట్టారని గుర్తుచేశారు. కేవలం చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థను ఎలాగైనా తీసివేయాలని రామోజీరావు, చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదవడమే పవన్ కళ్యాణ్ పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.



సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

రూ.40.41 లక్షలతో అభివృద్ధి పనులు

బుచ్చిరెడ్డిపాళెంలోని 5వ వార్డులో దాదాపు రూ.40.41 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నుడా ద్వారా రూ.25 లక్షలతో నిర్మించిన సిమెంట్‌రోడ్డు, సైడ్ కాలువ, పాఠశాల వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.41 లక్షలతో నిర్మించిన సిమెంట్‌రోడ్డు, అలాగే రూ.10 లక్షల 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో నిర్మించిన సిమెంట్‌రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్ షాహుల్, వైస్ చైర్‌పర్సన్ లలిత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్ రెడ్డి, కౌన్సిలర్లు షకీలాబేగం, నస్రీన్, రహమత్, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, జయంతి, అనంతలక్ష్మి, సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు మోర్ల మురళి, ప్రవల్లిక, అల్లాభక్షు, డాక్టర్ అల్లాభక్షు పాల్గొన్నారు.

ఇస్రో రాకెట్ నమూనా ప్రదర్శన

పొదలకూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో రూపొందించిన చంద్రయాన్–3 ఉపగ్రహాన్ని శుక్రవారం ప్రయోగిస్తున్న నేపథ్యంలో ఆ ప్రయోగం విజయవంతం కావాలని మండలంలోని నావూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు రాకెట్ నమూనాను గురువారం ప్రదర్శించారు. హెచ్‌ఎం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ రాకెట్ నమూనాను రూపొందించారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు హైస్కూల్లో..

ఇస్రో రూపొందించిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావాలని పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ సైన్స్‌క్లబ్ విద్యార్థులు రాకెట్ నమూనాను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సనత్‌కుమార్, క్లబ్ కోఆర్డినేటర్ ఏవీ సుధాకర్, సైన్స్ ఉపాధ్యాయుడు వింజం సుధాకర్ పాల్గొన్నారు.



నావూరు పాఠశాలలో రాకెట్ నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



వావిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కోవూరు: ప్రభుత్వ సేవలను ప్రజలకు సేవా భావంతో సకాలంలో అందించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులకు సూచించారు. మండలంలోని వేగూరు గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని గురువారం కలెక్టర్ హరినారాయణన్ తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ప్రజలతో కొద్దిసేపు మాట్లాడారు. వారికి అందుతున్న సేవలను ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, చిన్న చిన్న కారణాలు సంక్షేమ పథకాల అమలుకు అడ్డుకాకూడదని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ పార్వతి, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, డీపీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా విడవలూరు మండలంలోని వావిళ్ల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ప్రధానోపాధ్యాయుడు చెంచురామయ్య తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఇందుకూరుపేట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ హరినారాయణన్ గురువారం తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగులకు అందిస్తున్న సేవలు, శస్త్రచికిత్సలు, కాన్పుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డీసీహెచ్‌ఎస్‌డీ సీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దయాకర్ తదితరులు ఉన్నారు. తొలుత మండలంలోని సోమరాజుపల్లిలో జరుగుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. లబ్ధిదారులకు అందిస్తున్న సర్టిఫికెట్ల వివరాలను అధికారులు, సచివాలయ ఉద్యోగుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి యార్డులో రూ.50కే కిలో టమాటాలు

పొదలకూరు: స్థానిక నిమ్మమార్కెట్ యార్డులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సబ్సిడీపై కిలో టమాటాలు రూ.50కే అందజేయనున్నట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ అనితాకుమారి గురువారం తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పెదమల్లు రత్నమ్మ టమాటాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఒక కుటుంబానికి ఒక కిలో చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. టమాటాల ధరలు తగ్గే వరకు రాయితీపై టమాటాలను అందజేస్తామని తెలిపారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్‌లో లక్ష్మీదేవమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బాబు(ఫైల్)

ఈ ఫొటోలో పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ పేరు ఎస్‌కే బాబు. పొదలకూరు బిట్–1 సచివాలయం పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పొదలకూరు పట్టణంలోని మస్తాన్‌రెడ్డి నగర్‌లో ఉన్న బూసుపల్లి లక్ష్మీదేవమ్మ ఈ వలంటీర్ పరిధిలో వితంతు పింఛన్ పొందుతున్నారు. గతేడాది జూన్‌లో లక్ష్మీదేవమ్మ కీళ్లవ్యాధికి సంబంధించి చికిత్స పొందేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. ఆమె పొదలకూరుకు వచ్చి పింఛన్ తీసుకోలేని పరిస్థితిలో ఎస్‌కే బాబు హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు.

వలంటీర్ మేలు మరువలేను



"వలంటీర్ బాబు చేసిన మేలును మరువలేను. గతేడాది నేను అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో నా అడ్రస్ తెలుసుకుని హైదాబాద్‌కు వచ్చి పింఛన్ అందజేశారు. సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థ కొనసాగాలి.

– బి.లక్ష్మీదేవమ్మ, పొదలకూరు.

మానవత్వం చాటుకున్న వలంటీర్



పార్వతమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ సుబ్రహ్మణ్యం

ఈ ఫొటోలో బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ పేరు పత్రి సుబ్రహ్మణ్యం. ఈయనది ముత్తుకూరు మండలం ఈపూరు పట్టపుపాళెం. అదే గ్రామానికి చెందిన కోలంగారి పార్వతమ్మ కేన్సర్‌తో నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా ఆమె పరిస్థితిని తెలుసుకున్న వలంటీర్ సుబ్రహ్మణ్యం కేన్సర్ ఆస్పత్రికి వెళ్లి కొద్ది మాసాలపాటు ఆమెకు వితంతు పెన్షన్ అందజేసి మానవత్వం చాటుకున్నాడు. ఆస్పత్రి నుంచి పార్వతమ్మ ఇటీవల డిస్చార్జ్ అయ్యింది. ఇప్పటికీ ఆమె ఇంటికి వెళ్లి ఠంచన్‌గా పెన్షన్ అందచేస్తుండడంతో సుబ్రహ్మణ్యంకు పార్వతమ్మ కృతజ్ఞతలు తెలుపుతోంది.

ఒకే కుటుంబానికి 10 ధ్రువీకరణ పత్రాలు



10 సర్టిఫికెట్లు అందుకున్న పద్మావతి

ఈమె పేరు గూడూరు పద్మావతి. తోటపల్లిగూడూరు మండల వరకవిపూడి పంచాయతీ కుమ్మరపాళెం నివాసి. కుటుంబ సభ్యుల పేరుతో కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోగా గురువారం ఆ గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో రూపాయి ఖర్చు లేకుండా అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. దీంతో పద్మావతి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



తాళ్ల జ్యోత్స్న, తాటికొండ మనోజ

మనుబోలు: ట్రిపుల్ ఐటీకి మండలంలోని మడనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ ఏడాది పది పరీక్షల్లో మడమనూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికులు తాటికొండ సురేంద్ర–మాధవి దంపతుల కుమార్తె మనోజ 580 మార్కులతో మండలంలో మొదటిస్థానంలో నిలిచింది. అలాగే మరో చేనేత కార్మికుడు తాళ్ల వేణుగోపాల్–కల్పన దంపతుల కుమార్తె జ్యోత్స్న 562 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం వీరిద్దరూ కృష్ణాజిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివశంకర్ గురువారం తెలిపారు. మడనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2019 నుంచి ఇప్పటివరకు 9 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని తెలిపారు. పేద కుటుంబాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంపై మడమనూరు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మనోజ, జ్యోత్స్నలను అభినందించారు.

ఏడుగురు ఎంపిక

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల హైస్కూల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. తమ పాఠశాలలో చదివిన ఎ.వైష్ణవి, తేజశ్రీ, సాయిభార్గవి, అజ్మత్ నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో, తేజస్విని, శ్రీవిద్య, జయలాస్యప్రియ ఆర్‌కే వాలీ(ఇడుపులపాయ) ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు సాధించినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం పెర్సిస్ గురువారం తెలిపారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.